# విచిత్ర వివాహం

**నా** అంతట నేను మా అబ్బాయి కటువంటి పెళ్ళిచేసి ఉండను. ఆ పెటకం మా రామమూర్తే పెట్టాడు. వాడు తప్ప మరెవ్వరూ చెప్పినా అటువంటి ఆలోచనకు అంగీకరించి ఉండేవాణ్ణి కాను కూడానూ.

ఈ ఉత్తరం తిలకించండి.

"నాగపూరు, 5 జూలై, 1924.

"ప్రియ మిత్రమా, (ఉత్తరం ఇంగ్లీషులో) 3వ తేదీన నువ్వు రాసిన ఉత్తరం నన్ను చాలా ఆందోళన పెట్టింది. మీ అబ్బాయి పెళ్ళి విషయం ఆలోచిస్తున్నానన్నవాడవు మా అమ్మాయి విషయం ఎందుకు అడిగావు కావు? నేను నిన్నిందుకు క్షమించను – ఒక షరతుమీద తప్ప. అదేమిటంటే నువ్వు మీ అబ్బాయికీ మా అమ్మాయికీ వివాహం చెయ్యాలి. అది కూడా నేను చెప్పే తీరుగా. మా పెద్దదాని పెళ్ళితో నాకు పెళ్ళంటే హడలిపోయింది. నీకు కూడా అటువంటి భయమే కలిగి ఉండేది. నా పెద్దపిల్ల మీద నీకు తగినంత కటాక్షం ఉండి ఉంటే.

"మనిద్దరికీ భగవంతుడు కొంతబుద్ధి ప్రసాదించాడు. బుద్ధిగల మనిషి కొక్క అనుభవం. నా అనుభవం నీదికాదా? నువ్వు కూడా నేనుపడ్డ గోతిలో పడాలా? మంత్రాలబలిమియందు నాకు నమ్మకం వచ్చింది. నీకింకా చావలేదా? భార్యాభర్తల ఇష్టాయిష్టాలతో ఏమీ సంబంధం లేకుండా ఆజన్మాంతం ఇద్దర్నీ ఒకరికొకర్ని అంటగట్టడం పాపంగా తోచటంలేదా నీకింకా! ఊరికే తోచి ఏం ప్రయోజనం? ఆచరణలోకి ఎప్పుడొస్తుంది! కీకారణ్యంగా ఉన్న ఈ సంఘ చట్టాన్ని ఒక చెంప నించి బాగుచేసుకుంటూ ఎందుకు రాగూడదూ మనం! ఎప్పటి కైనా నందనవనం అవుతుందేమో.

"మనపిల్లలకు కొత్తరకం వివాహం చేద్దాం. ఎందుకు చెయ్యకూడదు! ఆ వివాహాన్ని గురించి వివరాలు తరవాత రాస్తాను. ముందు ప్రస్తుత వివాహ చట్టంలో ఉన్న లోపాలేమిటో గమనించి వాటిని మనం సరిచేసుకుందాం.

"నీకూ నాకూ ఇప్పుడు ప్రేమలో నమ్మకం లేదు. మనకు చిన్నతనంలో లేదా? అప్పుడు మనమనస్సుకు తృప్తి జరిగిందా? లేదు. ఎందువల్ల? మనం చేసుకోవలసిన

పనులన్నీ ఎవరో చేశారు. మనమూ మనభార్యలూ ఇంకోరి సహాయం లేకుండా కలుసుకుంటే ఎంత ఆనందంగా ఉండేది? ఊహించుకో.

"తరవాత మనసంసారాలు చూడు. భార్యాభర్తలకు మొదట్లో పరస్పరాకర్షణ ఉన్నా, అది సొంతంగా పొయ్యేదాకా, ఒకరిమీద ఒకరికి అసహ్యం పుట్టే దాకా, చక్కగా సుఖమయంగా ఉండవలసిన సంసారం కుళ్ళుగుంట అయేదాకా భార్యాభర్తలు ఒకర్ని గురించొకరు తెలుసుకోగూడని విషయాలన్నీ తెలుసుకుంటారు. ఆపైనేముంది? కొంచెం ఝరిగల ఆడదిగాని మగవాడుకాని అయితే సంఘచట్టాలన్నిటికీ తిరగబడటం, అతిక్రమించటం, అపఖ్యాతీ, లేకపోతే ఈ మురికిగుంటలోనే మునగానాం తేలానాం.

"ఆమీద మగవాడు ఆడదానికందకుండా సృష్టికావటం, పిల్లలు ఈ ఇద్దరిమధ్యా ఊగులాడుతుండటం. ఎవరో చెప్పినట్టు ఆడవాళ్ళు సంఘంలో చీట్లపేకలో పొడిముక్క లల్లే ఉన్నారు. వాళ్ళే విధంగా అభివృద్ధి పొందటానికీ అవకాశం లేదు. ఇంకో సంగతి చూడు. అన్నిశక్తులూ ఉన్న మగవాడికి ఆస్తిలో భాగమేమిటి? అసలు మగవాడికన్న ఆడదానికి అనేకరెట్లు డబ్బు అవసరం. పిల్లలను ఎవరికైనా కననీ కాక ఏ ఆడదానిపిల్లలు ఆ ఆడదాని పోషణలోనే ఉండటం సహజం. నా పెద్దమ్మాయి కొద్దికాలంలో ఉద్యోగంలో ప్రవేశించబోతున్నది. మా చిన్నదాన్ని పెద్ద చదువు చదివిస్తాను. అది నెలకు నూరు నూటయాభై సంపాదిస్తే కాని నాకు తృప్తి ఉండదు. నా స్వార్జితం ఇద్దరికీ పంచేస్తాను.

"మరో విషయం. మనిద్దరం ఒకరిమాటలు ఒకరు ఎట్లా అర్థం చేసుకుంటామో, నా పిల్ల మీ అబ్బాయిని అట్లా అర్థం చేసుకుంటుందని గ్యారంటీ ఇస్తున్నాను. నా పిల్ల మీవాడినెత్తిన బరువల్లే ఉండదు. దాని నైతిక బాధ్యతలూ ఆర్థిక బాధ్యతలూ మీ వాడినెత్తిన వెయ్యదు. ఇద్దరికీ ఎప్పుడభ్యంతరమైతే అప్పుడు విడిపోవచ్చును. ఒకర్ని గురించి ఒకరు అవసరమైనదానికన్న ఎక్కువ తెలుసుకోనక్కర్లేదు. నిజంగా మన అనుభవంలోకి, ఎన్నడూ రాని ప్రేమే వాళ్ళకు కలగటమే జరిగి, సామాన్యమానవులల్లేకాక, వాళ్ళు ఒకరి దౌర్బల్యమందు ఒకళ్ళు సానుభూతే చూపగలిగితే వాళ్ళిద్దర్నీ భగవంతుడు కూడా ఎడబాపలేడు కదా. ఆలోచించు.

"ముఖ్యమైన విషయం. ఇది చట్టంగా చేసి లోకానికి ఇవ్వకుమా. ఎంత మంచి చట్టమయినా సరే, అవివేకుల చేతుల్లో విషంగా మారుతుంది. లేకపోతే ఇప్పుడమల్లో ఉన్న చట్టాలన్నీ సంఘానికి పీడకలిగించాలని ఉద్దేశించబడ్డవా?

'ప్రత్యక్షంగా అంతా మాట్లాడతాను. నీక్షేమం..."

రామమూర్తి మీద నాకు గురేననండి, నాకు వాడి వాదన సమంజసమంగా తోచటం చేతనే కానివ్వండి నేను వాడి ఏర్పాట్లన్నీ అంగీకరించాను. అప్పటికి మా అబ్బాయికి

పదిహేడేళ్ళు. రామమూర్తి కూతురు పదమూడేళ్ళది. మరి మూడు సంవత్సరాల దాకా మేమేమీ చెయ్యదలచుకోలేదు.

1927 మార్చిలో రామమూర్తి మా ఇంటిపక్క స్థలం వెయ్యిగజాలు కొని ఇల్లు కట్టాడు. అది తన చిన్నకూతురి కోసమే.

నేను మా అబ్బాయితోకాని రామమూర్తి తన పిల్లతో కాని ఏమీ చెప్పలేదు.

ఆ డిశంబరులో రామమూర్తి ఇద్దరు పిల్లలనూ తీసుకుని (భార్య రొండో పిల్ల పుటకల్లోపోయింది) కొత్త ఇంట్లో ప్రవేశించాడు. “మూడు నెలల శలవుమీద వచ్చాను. అంతదాకా ఉండిపోతాను. ఈలోపుగా ఏం కానుందో చూదాం” అన్నాడు రామమూర్తి. నేను సరేనన్నాను. మావాడప్పటికి బి.ఎ. పూర్తి చేసి ఇంటి దగ్గరే ఉంటున్నాడు.

రామమూర్తి రొండోకూతురు అందమైన పిల్లే. చాలా చొరవగలది కూడాను. పేరు అలివేణి. మావాడికీ దానికీ స్నేహమయిందంటే వీడుకాదు కారణం. రామమూర్తి పెద్దకుమార్తె సామాన్యంగా ఇల్లుకదిలేది లేదు.

రామమూర్తి తనతెలివంతా వినియోగించి మా పిల్లలిద్దరికీ బాగా పరిచయం గలిగే అవకాశాలన్నీ ఇచ్చాడు. సినిమాలకూ నాటకాలకూ మావాడి వెంట అలివేణిని పంపిస్తుండేవాడు. మావాడు సామాన్యంగా వాళ్ళింటికొచ్చే వేళప్పుడు తను ఇంట్లో ఉండేవాడుకాడు. పెద్ద పిల్ల ఇంట్లో ఉన్నాలేనట్టే.

వీళ్ళకిటువంటి స్వేచ్ఛ ఇవ్వటం అపాయకరమేమో అనిపించేది మధ్య మధ్య నాకు. సంప్రదాయం ఎక్కడికిపోతుంది?

కాలం గడిచినకొద్దీ ఈ స్నేహం మేం చూస్తుండగానే పెరిగిపోయింది. అలివేణి అస్తమానం మావాడితో ఏదో రహస్యాలోచన చేస్తున్నట్టు గ్రహించాను. నాకర్థం కాలేదు. రామమూర్తితో చెబితే తనకర్థమైనట్టు సూచించాడు.

ఎందువల్లో నాకు రోజులు గడుస్తున్న కొద్దీ ధైర్యం తగ్గటం మొదలుపెట్టింది. మొత్తానికి రామమూర్తి మొండిఘటం.

ఒకరోజు నేను దీపాలు పెట్టిన తరువాత ఇంటికొస్తూ బజారులో ఒక బండిలో మావాడు అలివేణితో బండి ఎక్కిపోతూండటం చూశాను. బండిలో ఇద్దరూ కాక పెట్టె కూడా ఒకటుంది. నాకనుమానం కలిగింది. ఏ వూరైనా లేచిపోతున్నారా? ఎందుకు?

ఈ విషయమేమిటో కనుక్కుందామని నేను కూడా స్టేషనువైపున నడవటం మొదలుపెట్టాను. ఆ ఇద్దరూ అక్కడికి చేరుకున్నారన్నమాట. వాళ్ళెక్కినబండి స్టేషను దగ్గిర కనిపించింది. నేను మెల్లిగా లోపలికి పోయి అటూ ఇటూ చూడటం మొదలుపెట్టాను వీళ్ళకోసం. ఆ గుంపులో ఇద్దరూ కనపడ్డారు. మావాడి చేతిలో పెట్టె ఉంది. అలివేణి

చేతిలో రొండు టిక్కట్లున్నై. ఇద్దరూ బయటికి పోతున్నారు ప్లాటుఫారంమీదికి. ఇంతలో బండి కూడా వచ్చింది.

నేను కూడా ప్లాటుఫారం టిక్కెటు కోసం కిటికీ దగ్గిరికి పోతే అప్పుడే బుకింగాఫీసరుగారు ఎక్కడికో నిష్క్రమించాడు. ఆయనకోసం కేకలుపెట్టి ఎట్లాగైతేనేం ఆయనతో ఘర్షణ చేసి టిక్కెట్టు తీసుకుని నేను కూడా ప్లాటుఫారం మీదికి పొయ్యేటప్పటికి రైలు సాగింది. నేనొక్క అరనిమిషం సేపు దానివంక చూసి నిట్టూర్పు విడిచి వెనక్కు తిరిగేటప్పటికి "నాన్నా!" అని పిలుపు వినబడ్డది. మావాడు. నాకేమీ అర్థం కాలేదు.

"నువ్వు కూడా పోలేదేంరా?" అన్నాను.

మావాడాశ్చర్యంతో "ఎక్కడికి?" అన్నాడు.

నాకు మాత్రం ఏం తెలుసు?

"అలివేణి ఏది!" అన్నాను.

మావాడు నవ్వి "నీకెట్లా తెలిసింది!" అన్నాడు.

"ఏది అలివేణి?"

"నాగపూరు పోయింది."

నా కసలర్థం కాలేదు.

"ఎందుకు."

"పెళ్ళి చేసుకోటానికి. అక్కడ ఎవడో ఉన్నాట్ట. వాడిదగ్గిర్నించి ఉత్తరాలొచ్చేవి ఆ అమ్మాయికి. అంతా నాకు చెప్పింది. వాళ్ళ నాన్నకు చెప్పటానికి భయంట. సరే నా చాతయిన సహాయం నే చేశాను."

నేనేమీ మాట్లాడలేదు. ఏముంది మాట్లాడటానికి.

***మొదటి ముద్రణ : ఆంధ్రభూమి, అక్టోబర్ 1935***